డా. కొలకలూరి ఇనాక్

# తాజి రాజసం

రాణి విడిచిపోయే రాజు నొంటరిజేసి
రాజు విడిచిపోయె రాజ్య రమను
రాజ్య రమయు విడిచె రాజునుఁ బెక్కండ్ర
తాజి విడువలేదు రాజసంబు.

'ముంటాజ మహలు' లోనిదీ ఆటవెలది. ఈ సృష్టికర్త జాషువా.

'తాజమహలు' షాజహాను ముంతాజ బేగంల ప్రణయస్మృతి చిహ్నం. ముంటాజ మహలు కావ్యం ఆ ప్రణయమూర్తుల జీవితానికీ, తాజమహలు కళారూపానికీ అక్షర నిక్షేపం.

తాజమహలు చరిత్ర చెక్కిళ్ళమీద ఘనీభవించిన కాలం కన్నీటిబొట్టు.

ముంటాజ మహలు ప్రేయసీ వియోగార్తుడు సందర్శించిన తేజః పుంజంగా ఆంధ్ర శారద నేత్ర కాంత్యంజలి.

ముంటాజ మహలు ఖండ కావ్యంలో చివరిదీ పద్యం. కావ్య కన్య వెక్కివస్తూ చేసుకొన్న చివరి ముస్తాబు. కాబట్టి సాధ్యమైనంత కవితా సౌందర్యం సముజ్వలం అయివుంటుంది.

*　　　*　　　*

రాణి పేరు ముంతాజ బేగం. ముంతాజ, ముంతాజి, ముంటాజ, ముంటాజి ఆపేరులోని ప్రథమార్ధానికి రూపాంతరాలు. 'రాజునుఁ బెక్కండ్ర' 'రాజులఁ బెక్కండ్ర' ప్రత్యంతరాలలో రూపాంతరాలు. రాజులఁ బెక్కండ్ర కవికి అభీష్టరూపం. ఆద్య రూపం ఆ కాలానికీ, అనంతర రూపం తదనంతర కాలాలకు ప్రవర్తించటం గుర్తింపవచ్చు శిల్పకళారూపం తాజమహలు. సాహిత్య కళారూపం ముంటాజ మహలు. అది పాలరాతి హేల. ఇది అక్షర లీల అది నేత్రానందకరం. ఇది హృదయానందకరం. అదీ, ఇదీ రసానందం. రసరాజ్య పారవశ్యం.

*　　　*　　　*

ఈ పద్యంలో ఉన్న పదాలు రమారమిగా డజను. వీటిలో అర్ధం తెలియని పదాలు లేవు పరమార్ధం తెలిపేవి ఉన్నాయి. పరమార్ధం కన్నున్న గుండెకు కనిపిస్తుంది. సహృదయుడి గుండె అపరిమితే పరమార్ధ పరిమితి. గుండె కొద్దీ పరమార్ధం. దానికి హద్దు అవధీ లేవు.

*　　　*　　　*

రాణి రాజు రాజ్యం గతించటం విభిన్న కాలాలకు సంబంధించిన చారిత్రక సంఘటనలు. తాజమహలు నేటికీ ఉన్న కళారూపం. భిన్న చారిత్రక ఘట్టాలు ఘటించటం కథన నైపుణ్యం.

రాణిని రాజు స్మరించాడు. రాజును రాజ్యం స్మరించింది. రాజ్యాన్ని పలువురు స్మరించారు. తాజమహలును భిన్న దేశాలు స్మరించాయి. మానవ స్మరణ నుంచి మహిత కళాసృష్టి అవతరించటం చెప్పిన తీరు కథా కథన కౌశలం.

ఈ పద్యం ఒక చరిత్రశక్తి అంతా నిక్షిప్తమయిన పిండీకృతరూపం.

*　　　*　　　*

భార్య స్మృత్యర్థం 'సుదర్శనమహలు' కట్టించుకొన్న రామిరెడ్డి అటువంటి స్మృతి చిహ్నంగాఉన్న తాజమహలు కథ కావ్యంగా జాషువాతో వ్రాయించాడు.

రామిరెడ్డి జాషువా గతించారు.

కాని తాజమహలులాగా, సుదర్శన మహలులాగా ముంతాజ మహలు కావ్యం నిలిచింది. భవిష్యత్తుకు మిగిలింది.

*　　　*　　　*

పద్యంలో రాజ్యరమ 'రెండుసార్లు ప్రయుక్తమయింది. 'రాజు' మూడుసార్లు. 'విడిచిపోయె' అదే రూపంలో రెండుసార్లు, అదే అర్ధంలో ఇంకోసారి, వ్యతిరేకార్ధంలో మరోసారి ఉంది.

పునరుక్తి దోషం. పునః పునః పునః ఉక్తి ఏమవుతుంది ?

దోషం పాల పాత్రలో మజ్జిగ చుక్క.

కావ్యంలో దోషాలు లేకుండా వుండటం వాంఛనీయం.

ప్రాణం వున్నకావ్యం మరింతగా కోరదగ్గది.

అందువల్ల దోషంలేని కావ్యంకంటే దోషమున్నప్పటికీ ప్రాణమున్న కావ్యం కోరదగ్గది. చేరదగ్గది. ప్రాణం అంటే కావ్య ప్రయోజన సిద్ధి. రసానందం.

ఇవి గుణాలు, ఇవి దోషాలు అన్నదెవరు ? ఎప్పుడు ? అవి ఏ కవులకు కావ్యాలకు వర్తించేవి?

పద్యంలో 'రాణి' ఒక్కసారే కనిపించింది. ఆమె అల్పాయుష్కురాలు. పైగా పరదామరుగు మనిషి. ఒక్కసారి కనిపించటమే అబ్బురం.

'రాజ్యరమ' రెండుసార్లు దర్శన మిచ్చింది. షాజహాను పరిపాలనలో నిండు జీవితం, అనంతర రాజుల పాలనలో పండుజీవితం, వెళ్ళమార్చుకొంది మొగలాయి రాజ్యరమ.

షాజహాను మూడుసార్లు ప్రత్యక్షమయ్యాడు. అతడిజీవితం ప్రణయమూర్తిగా, కళా నిర్మాతగా, బందీగా మూడు పాయలు అయింది. అందుకే మూడుసార్లు ముమ్మూర్తులా దర్శనమివ్వటం.

రాణి రాజు రాజులు రాజ్యం పోవటం చెప్పటానికే 'విడిచి పోయె' అన్నిసార్లు పలకటం. ఈ మాటతో చరిత్రచక్రం తిరగటం కనిపించింది. ఒక్క చిన్న పద్యంలో ఇంత చరిత్రను ప్రత్యక్షీకరించటానికి ఈ క్రియ అంతగా పునరుక్తమయింది.

కావ్యేతివృత్తం అంతాపునఃశ్చరణ చేస్తున్న పద్యంలో దానిని భిన్నదశలు చెప్పటంలో పునరుక్తి వచ్చింది. అవసరమయింది. అందగించింది.

పునఃఉక్తి, చేష్టసామాజికం. సామాజిక భాషలో సారస్వతం పరిపుష్టం కావించే ఆధునికులకు పునరుక్తి సమాజంలోలాగ— సారస్వతంలో — దోషం కాదు. గుణం.

భాషకున్న శక్తుల్లో పునరుక్తి బలమయింది. దోషం కాదు. గుణం.

ప్రతిభా సంపన్నమయిన పునరుక్తి రసరాజ్యానికి ఘంటా పథం.

ఇక్కడ పునరుక్తి విశాలకాల ప్రాంగణ పర్యాలో కన సమర్థంగా, శక్తిసంతంగా అవతరించింది.

*  *  *

రాణి విడిచిపోయె రాజునొంటరిజేసి,

ముంతాజబేగం షాజహానులలో ఆమె ముందుగా చనిపోయింది, అంతేకాని రాణి రాజును విడిచిపోలేదు. పోగలదా? పోలేదు. పోతుందా? పోదు.

తన హృదయంలో ఉన్న బేగంను వదిలి ఉండలేడు. వెళ్ళనివ్వడు.

వెళ్ళదలుచుకొన్నా, వెళ్ళనిచ్చినా వెళ్ళటం ఎలా కుదురుతుంది? మృత్యువు ఆమెను తీసుకుపోతుంది. పోనీ ఆమె మరణిస్తుంది. కానీ పోతుందా?

రాజు ఒంటరివాడు ఎలా అవుతాడు. తోడు రాజ్యరమ ఉంది. మంత్రులు, సామంతులు, సైన్యం, జనం, భోగభాగ్యాలు, సిరిసంపదలు ఇంతగా ఉన్నవాడు అంతగా లేనివాడు ఒంటరివాడు ఎలా అవుతాడు?

భార్యలేనివాడు అనదలచినా షాజహాను మహమ్మదీయ చక్రవర్తి అనీ, జనానా ఉన్నవాడు అని గుర్తుకువస్తే అతని ఒంటరితనం ఎలా సమర్థించటం?

జాషువా తెలుగు పలుకుబడి జవం జీవం శిరః దఘ్నంగా తెలిసిన కవి. ఆమె అందరినీ విడిచిపోయింది. అంటే చనిపోయింది అనే కదా అర్థం. ఇక్కడ కర్తకీ, క్రియకీ సంబంధం స్థాపించటం వ్యక్తికి ప్రాధాన్యం ఇవ్వటం. మృత్యువు మీద ప్రాణిశక్తి నిలపటం. ఇది నుడికారంలోని బలం.

తెలుగులోనే కాదు. చాలా భాషల్లో మృత్యువును తెలిపే పదాలు కోమలాభివ్యక్తిని సంతరించుకొన్నాయి. స్వర్గస్థుడయ్యాడు. పరమపదించాడు. గతించాడు. పోయాడు, వంటివి మరణించాడు అనటానికే పర్యాయాలు.

మృత్యువును కాని, దాని నగ్నతను కాని, ధైర్యంగా ఎదుర్కోలేని మనుష్యుల్లాగానే భాషకు సున్నితత్వం వస్తుంది. పాలు తాగుతున్న పసివాడు ఇటునుంచి అటు ముఖం తిప్పుకొన్న విరామం (టాగూరు) వంటిదే మృత్యువు, అని గుర్తిస్తే దాని చుట్టూ ఖేదం లేదు. నిర్వేదం లేదు

'రాజునొంటరిజేసి' అన్నది దాంపత్య ధర్మం నిక్షిప్తమయిన అభివ్యక్తి. ఆమె వుండగా షాజహాను జంట అయినాడు. ఆమె లేక పోగా ఒంటరి అయినవాడు. సామ్రాజ్యం జనానా ఉన్నా ఒంటరితనం అనుభవించాడు. ఇది వాళ్ళ దాంపత్య బంధం, సంబంధం వివరించటం. ఆమె గతిస్తే అతడూ గతించినట్లే. అందుకే అతడికీ ఏకాకితనం. ఆమె లేనినాడు అతడెవరికీలేడు. రాజ్యానికీ లేడు. జనానాకీలేడు. తనకి తనే లేడు. తనంతట తను తనకు తాను లేకుండా చేసుకోలేదు. ఆమె చేసింది. రాజునొంటరి చేసింది. ఈ అభివ్యక్తిలో వాళ్ళ దాంపత్య జీవన మాధుర్యం ధ్వనించింది.

*  *  *

రాజు విడిచి పోయె రాజ్యరమను

మహాసామ్రాజ్య పరిపాలకుడు షాజహాను. సామ్రాజ్యం లక్ష్మీరూపం. అందుకే అది రాజ్యరమ.

లక్ష్మిచంచల. ఉన్నచోట ఎంతో కాలం ఉండక పోవటం ఎక్కించిన అందలం మీద అలాగే నిలపకపోవటం దాని గుణాలు.

రాజ్యరమ ఎందరో రాజులుగా, ఎన్నో రాజ్యాలుగా, చరిత్ర గతిలో వెళ్ళిపోయింది. మార్పు దాని మనస్తత్వం.

లక్ష్మి ఉన్నచోట వెలుతురు. లేనిచోట చీకటి. అందుకే రాజుకు కనుచీకటి గదిచీకటి. చెరసాల.

రాజ్యరమ చేయిదాటి, గడపదాటి చేరదలచిన చోటు వెదుకుతుంటే వెంటబడటం పొరపాటు. ఆ పొరపాటుకు ప్రాయశ్చిత్తమే షాజహానుకు ఏడేళ్ళ బందిఖానా.

వంశపారంపర్యంగా హక్కుభుక్తంగా అనుభవించాలన్న చక్రవర్తుల ఆశను రాజ్యరమ తృణీకరించటమే యుద్ధాలూ, హింసలూ, జననష్టం, తండ్రిని తనయుడు బంధించటం, నిర్బంధించటం.

షాజహాను చక్రవర్తి జీవిత వాంఛ భౌతిక కాయానికి బందిఖానా అయితే బేగం స్మృతి తాజమహలు అయింది.

సుఖలోలత్వం దుఃఖాన్నీ, దుఃఖ తీవ్రత కళాఖండాన్ని సృష్టించాయి.

మొగలాయి రాజ్యమనే లక్ష్మి, భారత మహాసామ్రాజ్యానికే లక్ష్మి అయిన తాజమహలును ప్రసాదించింది. చరితార్థమయింది.

షాజహాను చక్రవర్తి ఆ రాజ్యరమనూ, ఈ రాజ్యరమనూ, వదిలి వెళ్ళిపోయాడు.

మర్త్యుడు అమర్త్యం నీడలో తాత్కాలికంగా నిలిచినా మర్త్యుడు మర్త్యుడే! అమర్త్యం అమర్త్యమే! అతడే షాజహాను! అదే తాజమహలు!

'తాజి ఏడువలేదు రాజసంబు!

యమున ఒడ్డున తాజమహలుగా, ఆంధ్రినుదుట ముంటాజ మహలుగా, సంక్షిప్తమయిన కళాహృదయ కాంక్ష తాజమహలును తాజి చేసింది

సత్వరజస్తమోగుణాలలో మార్పు, కదలిక ప్రాణభూత ధర్మంగా కలది రజోగుణం. రజోగుణం నుంచి రాజసం. అది తాజమహలుకు ఎలా ఉందనటం, పోలేదనటం ?

ముంతాజి బేగం రాజసమే తాజమహలు రాజసం అయింది.

ఈ అవటం ఎలా జరిగింది ?

తెల్లనిదీ, చల్లనిదీ దర్శనీయం వాంఛనీయం అయిన పాలరాతితో ఆమె శరీరానికి పోలిక కావచ్చు

కట్టడంలోని అన్నిభాగాలు క్రమంగా, నిండుగా కుదిరికగా, విశాలంగా ఉండడం రాణి మూర్తితో పోటీతే పోలవచ్చు.

దాన్ని నిర్మించిన శిల్పులు కావించిన ప్రాణప్రతిష్ఠ కావచ్చు.

రాశ్శైత్తిన కూలీల చెమట నిర్మించిన స్వర్గం దిగిరావటం కావచ్చు.

ఏమయితేనేం తాజికి రాజసం వచ్చింది.

తాజమహలుకు ఈ రాజసం ముంతాజ్ బేగం అకారానికి రూపాంతరం కావటం కంటె ఆమె ఆత్మకు అవరణం కావటం వల్ల వచ్చింది. ఆమె ఆత్మతో ఐక్యం కావటం వల్ల, తాదాత్మ్యం చెందటం వల్ల, తనలో లీనం చేసుకోవటం వల్ల, తాను లీనమయి పోవటం వల్ల, తాజమహలు ముంతాజి బేగమే అయిపోవటంవల్ల, తాజికి రాజసం వచ్చింది

తాజి ముంతాజి.

అందుకే షాజహానుకు తాజమహలును చూడాలనీ, ఆ రాజసం చూడాలనీ, బందిఖానాలో ఉన్నా, అంత తాపత్రయం, అంత ఆరాటం.

బందీ, దురదృష్టవంతుడూ రాజు మళ్ళీ కళ్ళు లేనివాడు.

అతను చూడలేని తాజిని ఈ దేశాలు, విదేశాలు చూశాయి. అతడి కళ్ళు లోకం కళ్ళు.

తాజమహలు శిల్పం కాదు స్త్రీ మహారాణి చరిత్రలో చిరగని పుట. జీవి అంతులేని కళాతృష్ణకు వ్యాఖ్యానం. మనిషి మర్త్య మర్త్యులకు కట్టిన వంతెన. స్రష్టకు ఆశ్చర్యమైన సృష్టి.

దాని ఆత్మ దీప్తిమంతం కావించిన ముంటాజ మహలు కావ్యం ఆంధ్రికి అలంకారం.


కాకతి పబ్లికేషన్స్ వారి

# ప్రాచీనాంధ్ర సాహిత్య గ్రంథములు

**1. క్రీడాభిరామము** - వినుకొండ వల్లభరాయడు.
56 పేజీల పీఠిక—పీఠికా రచయిత శ్రీ బి. ఎన్ శాస్త్రి వెల **4 00**

**2. యయాతి చరిత్ర** - పొన్నికంటి తెలగనార్య.
50 పేజీల పీఠిక—పీఠికా రచయిత శ్రీమాన్ ముడుంబై రంగకృష్ణమాచార్య వెల **6-00**

**3. మల్లభూపాలీయము** - మహామహోపాధ్యాయ ఎలకూచి బాలసరస్వతి.
60 పుటల పీఠిక—పీఠికా రచయిత శ్రీ నీలాజంగయ్య వెల. **3-50**

**4. నీతి శతకము** - పుష్పగిరి తిమ్మన.
20 పుటల పీఠిక—పీఠికా రచయిత శ్రీ నీలాజంగయ్య వెల. **2 00**

పై గ్రంథములు క్రౌన్ 1/8 సైజులో గ్లేజు కాగితముపై ముద్రింపబడి అమ్మకమునకు సిద్ధముగా నున్నవి.
పై నాలుగు గ్రంథము లొకేసారి తెప్పించుకొనువారికి వి. పి. ఛార్జీలు మేమే భరింతుము.

కాకతి పబ్లికేషన్స్ పబ్లిషర్స్, బుక్ సెల్లర్స్ అండ్ స్టేషనర్స్,
3-4-424/5 నారాయణగూడ, హైదరాబాదు - 500 029.